సాక్షి
పార్వతీపురం మన్యం
బుధవారం । 29 । జనవరి । 2025



గురువుల ఎన్నికల సందడి

గురువుల సమస్యలపై పోరాడేందుకు ఎన్నుకోవాల్సిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల హడావుడి మొదలైంది.

- 8లో



ఉత్తరాంధ్ర అభివృద్ధికి రూ.50 వేల కోట్లు కేటాయించాలి

ఉత్తరాంధ్ర అభివృద్ధికి రూ. 50 వేల కోట్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి. సూర్యనారాయణ కోరారు.

- 8లో



కనీస పెంఛన్ రూ.9వేలు చెల్లించాలి

పెన్షనర్లకు కనీస ఫించన్ రూ.9వేలు చెల్లించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు డిమాండ్ చేశారు.

- 8లో

జాతర సైడ్‌లైట్స్


- అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు ఎండలోనే క్యూకట్టారు.
- కలెక్టర్ ఎం.శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ ఎస్.వి. మాధవ్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ దిలీప్‌కిరణ్, ఏఎస్పీ అంకితసురాన దగ్గరుండి జాతర బందోబస్తును పర్యవేక్షించారు.



- సిరిమాను వద్ద వేషధారణలు ఆకట్టుకున్నాయి.
- మధ్యాహ్నం 2.50 నిమిషాలకు గిరిడ వారింటికి అమ్మవారి ఘటాలు చేరుకున్నాయి.
- మధ్యాహ్నం 3.10 నిమిషాలుకు సిరిమాను ప్రదేశానికి చేరుకున్న పూజారి జన్ని పేకాపు రామారావు
- 3.30 నిమిషాలుకు సిరిమానోత్సవం కార్యక్రమం ప్రారంభం. 5.10కి ముగింపు
- గతేడాది కంటే 50 నిమిషాలు ముందుగా బయల్దేరిన సిరిమానోత్సవం
- అధికారుల సమన్వయంతో సజావుగా పోలమాంబ అమ్మవారి జాతర
- భక్తులకు తాగునీరు అందించిన శ్రీసత్య సాయి సేవా సమితి సభ్యులు
- శ్రీసూర్య డవలపర్స్ ఆధ్వర్యంలో మజ్జిగ, పులిహోరా పంపిణీ
- డ్రోన్ కెమెరాలతో జాతర పర్యవేక్షణ
- పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్న సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ్
- సిరిమాను వెంట పురవీధుల్లో పర్యటించిన అడిషనల్‌ఎస్పీ దిలీప్‌కిరణ్



తలనీలాలు అర్పిస్తున్న భక్తులు



దారులన్నీ జన సంద్రమే.. ఎటువైపు చూసినా కనుచూపు మేర 'శంబర'మే. దిక్కులు పిక్కటిల్లేలా అమ్మ శరణు ఘోష ఓ వైపు.. సాక్షీభూతంగా నిలిచిన గోముఖీ నది సవ్వడులు మరోవైపు లయబద్ధంగా సాగుతుంటే.. చల్లని తల్లి, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి.. ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం.. గిరిజనుల కొంగు బంగారం పోలమాంబ 36 అడుగుల సిరిమానుపై ఠీవీగా ఆసీనులై, పురవీధుల్లో ఊరేగింది. తన చల్లని చూపుతో భక్తులకు ఆశీర్వచనాలు అందజేసింది. ఈ అపురూప ఘట్టాన్ని కనులారా తిలకించిన భక్తకోటి మురిసిపోయింది. ఆనందంతో పులకించిపోయింది.

పోలమాంబ పాహిమాం

- భక్తజన 'శంబర'ం
- కనుల పండువగా పోలమాంబ సిరిమానోత్సవం
- తరలివచ్చిన లక్షలాదిమంది భక్తులు
- భక్తుల జయజయధ్వానాల నడుమ పురవీధుల్లో ఊరేగిన వనదేవత



శంబర పోలమాంబ సిరిమానోత్సవం



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

సాక్షి, పార్వతీపురం మన్యం/మక్కువ/సాలూరు:

గిరిజనుల ఆరాధ్య దేవత శంబర పోలమాంబ సిరిమానోత్సవం మంగళవారం కనులపండువగా సాగింది. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం శంబరలో కొలువైన పోలమాంబ జాతరకు ఉమ్మడి విజయనగరం జిల్లాతోపాటు, శ్రీకాకుళం, విశాఖపట్నం, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. సోమ, మంగళవారాల్లో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పసుపుకుంకుమలు, చీరలు సమర్పించారు. మొక్కుబడులు చెల్లించారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించారు. ఈ సంబరంలో కీలక ఘట్టమైన సిరిమానోత్సవం మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమైంది. పూజారి జన్నిపేకాపు రామారావు మేళతాళాలు, భక్తుల జయజయ ధ్వానాల నడుమ సిరిమానును అధిరోహించారు. తొలుత గిరడ వారి ఇంటి వద్ద పూజలు అందుకున్న అనంతరం.. సావిడి వీధిలోని మునసబు ఇంటి వద్ద పసుపు కుంకుమలు అందుకుని సిరిమాను ముందుకు సాగింది. ప్రధాన రహదారి మీదుగా ఎస్సీ కాలనీ, పనుకు వీధి, గొల్లవీధి నుంచి తిరిగి సావిడివీధికి చేరుకుంది. అనంతరం అమ్మవారి ఘటాలను గద్దె వద్ద ఉంచడంతో సిరిమాను ఘట్టం ముగిసింది.

పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి



పోలమాంబకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి సంధ్యారాణి

పోలమాంబ పండగను రాష్ట్ర ఉత్సవంగా నిర్వహిస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అమ్మవారికి ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించారు. కుటుంబ సభ్యులతో కలిసి తల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

అంపకోత్సవం రోజున గ్రామంలోకి పోలమాంబ

శంబర పోలమాంబ జాతరలో సోమవారం తొలేళ్లు, మంగళవారం సిరిమానోత్సవం, బుధవారం అంపకోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఫిబ్రవరి 4న మారు జాతర నిర్వహిస్తారు. తర్వాత ఎనిమిది వారాల పాటు జాతర కొనసాగుతుంది. అప్పటి వరకూ ప్రతి మంగళవారం భక్తులు తల్లి దర్శనానికి వస్తూ ఉంటారు.

పటిష్ట బందోబస్తు

సిరిమాను సంబరాన్ని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్‌రెడ్డి, అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్ దగ్గరుండి పర్యవేక్షించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా 700 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. పోలమాంబను దర్శించుకున్న ఎస్పీ బందోబస్తు ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. సిరిమాను ఆద్యంతం అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్, సబ్ డివిజన్ ఏఎస్పీ అంకిత సురాన, ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి సిరిమాను వెంబడి ఉండి బందోబస్తును స్వయంగా పర్యవేక్షించారు. పోలీస్ సేవాదళ్ సభ్యులు దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణులకు ఇబ్బందులు కలగకుండా సేవలందించారు. అందరి సహకారంతో అమ్మవారి సిరిమానోత్సవం ప్రశాంతంగా ముగిసిందని ఎస్పీ తెలిపారు. పోలీస్ శాఖ చేపట్టిన పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు, భద్రతా చర్యలు సత్ఫలితాలిచ్చాయన్నారు.



అమ్మవారి ఘటాలు

కిక్కిరిసిన క్యూలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పోలమాంబ అమ్మవారి దర్శనానికి ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. 10 గంటల సమయానికి క్యూలు నిండిపోయాయి. నీడ కోసం ఏర్పాటు చేసిన పెండాల్స్ చాలక.. ఎండలోనే భక్తులు అవస్థలు పడ్డారు. గంటలకొద్దీ లైన్లలో నిల్చోవాల్సి వచ్చింది. గోముఖి నదిలో స్నానాలు చేసి, అమ్మవారిని దర్శించుకుని కోళ్లు, పోతులు, చీర, పసుపుకుంకుమ సమర్పించి అమ్మవారికి ప్రణమిల్లారు. ప్రధాన గుడిలోపలికి వెళ్లలేకపోయిన భక్తులు.. వనం గుడి వద్దకు వెళ్లి, పెద పోలమాంబను దర్శించుకుని, వేప చెట్టుకు పూజలు చేసి, అక్కడ నుంచే మొక్కలు చెల్లించుకుని వెనుదిరిగారు. దేవస్థానం అధికారులు ఉచిత దర్శనంతో పాటు, రూ.20, రూ.100 టికెట్లతో ప్రత్యేక దర్శనం కల్పించారు.

లక్షల్లో తరలి వచ్చిన భక్తులు

ఏటా జనవరి చివరివారంలో జరిగే పోలమాంబ జాతర వేడుకకు లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారు. ఈ ఏడాది కూడా దాదాపు 3 లక్షల మందికిపైగా తరలివచ్చారని అంచనా. పోలమాంబ శంబర గ్రామంలో పుట్టి పెరిగినందున గ్రామస్తులంతా పోలమాంబను తమ ఇంటి ఆడపిల్లగా భావిస్తారు. సంక్రాంతి పండగకు ప్రతి ఆడపిల్ల పుట్టింటికి వెళ్లే ఆనవాయితీ ఉంటుంది. అందువల్లే పోలమాంబ అమ్మవారిని సంక్రాంతి రోజుకు ముందు వచ్చే మంగళవారం గ్రామంలోకి తీసుకువస్తారు. పండగ తరువాత వచ్చే మంగళవారం అమ్మవారికి పూజలు నిర్వహించి, ఆ తరువాత వచ్చే మంగళవారం సిరిమానోత్సవం నిర్వహించడం కొనసాగింపుగా వస్తోంది. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు ఉత్తరాంధ్రతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తుంటారు. ఈ ఏడాది కూడా అమ్మ జాతర భక్త జన సంద్రంగా మారింది. ఆర్టీసీ 130 ప్రత్యేక బస్సులను నడిపింది. రాకపోకలకు భక్తులు ఇబ్బందులు పడకుండా సేవలందించింది.

స్వల్ప ఘటనలు



సిరిమాను సంబరానికి ముందు తల్లి సేవకురాలిపై పిట్టగోడ కూలింది. దీంతో స్వల్ప గాయాలపాలైన ఆమెను ఫీడర్ అంబులెన్స్‌లో తరలించి చికిత్స అందించారు. మాజీ ట్రస్టు బోర్డు చైర్మన్ పూడి దాలినాయుడుకు భక్తులు విసిరిన కొబ్బరి చిప్ప తగలడంతో స్వల్ప గాయమైంది.

- సిరిమానోత్సవం సమయంలో పారిశుద్ధ్య చర్యలు అంతంత మాత్రం గానే కానవచ్చాయి. రథం తిరుగుతున్న సమయంలో భక్తులు అరటిపండ్లు విసరడం ఆనవాయితీ. గతంలో వెనువెంటనే వీటిని శుభ్రపరిచేవారు. ఈసారి సకాలంలో స్పందించకపోవడంతో, అరటి పండ్ల మీద కాలు వేసి, చాలా మంది భక్తులు జారిపడ్డారు.
- జాతరలో పెద్ద ఎత్తున తాత్కాలిక దుకాణాలు వెలిశాయి. ఈ క్రమంలో తమ నుంచి కొంత మంది ఆశీల రూపంలో దౌర్జన్యంగా నగదు వసూలు చేశారని పలువురు వ్యాపారులు వాపోయారు.
- **ముగిసిన ఉత్సవం:** సిరిమాను ఉత్సవం మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమైంది. తిరిగి సాయంత్రం 5.10 నిమిషాల సమయంలో గద్దె వద్దకు ఘటాలు చేరుకోవడంతో సంబరం ముగిసినట్లయింది.
- స్వల్పమైనవి మినహా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన పీఓ

పోలమాంబ జాతరకు విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యమూ లేకుండా చూడాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలమాంబ సిరిమాను పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. మంగళ, బుధవారాల్లో అధిక సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో రద్దీ దృష్ట్యా రానూపోను రవాణా, భక్తుల దర్శనార్థం క్యూలు ఏర్పాటుచేయాలన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన స్నానపు గదులు, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య శిబిరాలు ఏర్పాట్లను పరిశీలించిన ఆయన.. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ తలెత్తకుండా పటిష్ట బందోబస్తు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

రాళ్లు తేలిన సిరిమాను మార్గం..



సిరిమాను తిరిగే మార్గంలో హడావిడిగా రహదారి పనులు చేపట్టారు. జాతరకు మూడు రోజులు ముందే పనులు ప్రారంభించడం.. అవి కూడా ఉమ్మతడిగా మమ అనిపించడంతో మొత్తం రాళ్లు తేలి నడిచేందుకు కూడా భక్తులు ఇబ్బందులు పడ్డారు. సిరిమాను తిరిగే పనుకువీధి మార్గంలో పెద్ద పెద్ద రాళ్లు బయటకు వచ్చాయి. దీంతో రథం తిరగడానికి కాస్త ఆటంకం కలిగింది.



పోలమాంబ దర్శనం కోసం ఎండలో నిరీక్షించిన భక్తులు



శంబర పొలిమేరలోనే భక్తుల వంటావార్పు





సిరిమానోత్సవంలో వేషధారణల సందడి



తల్లి దర్శనం కోసం...

సంక్షిప్తంగా...

హాస్టల్స్ విద్యార్థులకు ఆరోగ్యకర వాతావరణాన్ని ఏర్పాటుచేయాలి

- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



సాలూరు: హాస్టల్స్‌లో ఆరోగ్యకర వాతావరణంలో విద్యార్థులు విద్యను అభ్యసించే పరిస్థితులను ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అభిప్రాయపడ్డారు. ఈ మేరకు మంగళవారం ఆయన పట్టణంలో తన స్వగృహంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఒకరితో ఒకరు స్నేహపూర్వకంగా మెలగాల్సిన విద్యార్థుల మధ్య వైరాలు, ఘర్షణలు, దాడులు తదితర అనేక సంఘటనలు జరుగుతున్నాయని, ఇది చాలా ప్రమాదకరమైన వాతావరణమన్నారు. ఓ వైపు అనారోగ్యాలతో విద్యార్థుల మరణాలు, మరోవైపు ఫీజులు చెల్లించలేక, చదువు ఒత్తిడి తట్టుకోలేక విద్యార్థులు మరణిస్తున్న హృదయ విదారక సంఘటనలు చూస్తున్నామని వాపోయారు. తాజాగా పట్టణ సమీపంలోని పీఎన్‌బొడ్డవలస గురుకుల పాఠశాలలో జరిగిన సంఘటనపై అధికారులు స్పందించి సమగ్ర దర్యాప్తు నిర్వహించి తగుచర్యలు తీసుకోవాలని కోరారు.

కేజీబీవీని సందర్శించిన డీడీ

సీతంపేట: స్థానిక కేజీబీవీ పాఠశాలను గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర మంగళవారం సందర్శించారు. పప్పు, కూరను మరింత రుచికరంగా వండాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆయన వెంట ఏఎంఓ పి.కోటిబాబు ఉన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులను త్వరగా గుర్తించాలి

- రాష్ట్ర కుష్ఠు నివారణశాఖ జేడీ సాగర్

విజయనగరం ఫోర్ట్: కుష్ఠు వ్యాధిగ్రస్తులను త్వరగా గుర్తించాలని రాష్ట్ర కుష్ఠు నివారణశాఖ జేడీ డాక్టర్ సాగర్ వైద్య సిబ్బందికి సూచించారు. విజయనగరం సర్వజన ఆస్పత్రి డెర్మటాలజీ విభాగం వైద్యులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్పర్శ, నొప్పిలేని మచ్చలను కుష్ఠు వ్యాధి లక్షణాలుగా గుర్తించాలన్నారు. సమావేశంలో జిల్లా కుష్ఠు నివారణ అధికారి డాక్టర్ కె.రాణి, డాక్టర్ శివకుమార్, డాక్టర్ అర్చన, డాక్టర్ పద్మశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్మీడియట్ పరీక్షలు

- జిల్లా రెవెన్యూ అధికారి హేమలత

పార్వర్వతీపురం/పాలకొండ రూరల్: జిల్లాలో మార్చి 1 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూశాఖాధికారి కె.హేమలత సూచించారు. ఇంటర్మీయట్ పరీక్షల నిర్వహణపై డీఆర్‌ఓ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా పరిధిలో 34 పరీక్ష కేంద్రాల్లో 5,126 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకొని తిరిగి స్వగ్రామాలకు వెళ్లేలా ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్యం, తాగునీటి సదుపాయాలు కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారిణి డి. మంజులావీణ, ఆరోగ్యశాఖ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ పి.జగన్‌మోహన్‌రావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు, ప్రత్యేకాధికారి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



అధికారుల సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో కె.హేమలత

గంజాయి రహిత రాష్ట్రమే లక్ష్యం

- 'సంకల్పం' స్ఫూర్తిదాయకం
- అధికారులకు దిశానిర్దేశం చేసిన రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారక తిరుమలరావు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర డీజీపీ ద్వారక తిరుమలరావు

విజయనగరం క్రైమ్: గంజాయి రహిత రాష్ట్రమే లక్ష్యమని, గంజాయి క్రయవిక్రయదారులు, రవాణాదారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర డీజీపీ, ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారక తిరుమలరావు తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన ఆయనకు ఎస్పీ వకుల్ జిందల్, కమాండెంట్ మాలిక గార్గ్, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి పూలమొక్కలు అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో డీజీపీ సమావేశమయ్యారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు జిల్లా పోలీస్‌శాఖ చేపట్టిన చర్యలపై సమీక్షించారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు ఎస్పీ వకుల్ జిందల్ చేపట్టిన సంకల్పం కార్యక్రమం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఇదే స్ఫూర్తితో పనిచేసి, జిల్లా పోలీస్ శాఖకు, రాష్ట్రానికి మరింత మంచి పేరు తీసుకురావాలన్నారు. నేరాల నియంత్రణలో సాంకేతికతను వినియోగించి, నేరాల కట్టడికి చర్యలు చేపడుతున్నామని, అవి నేడు సత్ఫలితాలనిస్తున్నాయన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, వివిధ నేరాలను ఛేదించడంలో పోలీసుల కృషిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డీజీపీకి ఎస్పీ వకుల్‌జిందల్ వివరించారు. అనంతరం డీజీపీని దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. సమావేశంలో విశాఖరేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి డీజీపీ అభినందనలు

జిల్లా పోలీసులు జమ్ము కశ్మీర్ వెళ్లి డిజిటల్ అరెస్టు కేసులో నిందితులను అరెస్టు చేసి, కేసును ఛేదించడం, రూ.20 లక్షల నగదును రికవరీ చేయడం, మరింత నగదును నిందితుడి బ్యాంకు ఖాతాలో ఫ్రీజ్ చేయడాన్ని డీజీపీ అభినందించారు. సీఐలకు త్వరలో డీఎస్పీలుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తామని తెలిపారు. గంజాయి నియంత్రణకు ఈగల్ అనే విభాగాన్ని ప్రత్యేకంగా ఏర్పాటుచేశామని, కింగ్ పిన్స్, గ్యాంగ్‌స్టర్స్‌ను అరెస్టు చేసి గంజా అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపామన్నారు. సమావేశంలో విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పైడితల్లి అమ్మవారి పూర్వ అర్చకుడు రవి మృతి


దేవులపల్లి రవి ప్రసాద్ శర్మ (ఫైల్)

విజయనగరం టౌన్: శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయంలో అర్చకుడిగా పనిచేసి పదవీవిరమణ చేసిన పూర్వ అర్చకుడు దేవులపల్లి రవిప్రసాద్ శర్మ మంగళవారం మృతిచెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారని కుటుంబసభ్యులు తెలిపారు. రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో ప్రధాన అర్చకుడిగా పనిచేయడంతో పాటు ఆలయ అభివృద్ధికి ఆయన విశేషంగా సేవలందించారు. కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్దనున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శివాలయం అర్చకుడిగా ఆయన సుపరిచితుడు. ఆయన మృతిపట్ల దేవాదాయశాఖ అధికారులు, పలువురు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఆధ్యాత్మిక గురువు మృతి


కిమిడి సత్యనారాయణ నాయుడు (ఫైల్)

రేగిడి: మండలంలో రేగిడి గ్రామానికి చెందిన ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యనారాయణ నాయుడు(80) గుండె పోటుకు గురై విశాఖపట్నంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. పారిశ్రామికవేత్తగా విశేష సేవలు అందించడంతో పాటు రేగిడి మండలంలో జ్యూట్, కేబుల్ పరిశ్రమలు రేగిడిలో నెలకొల్పి ఎన్నో కుటుంబాలకు ఉపాధి కల్పించారు. రేగిడి గ్రామంలో రూ.1 కోటితో మైసూర్ దత్తపీఠం నిర్మించి ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. ఆయనకు భార్య సత్యవతమ్మతో పాటు కుమారులు సూరపునాయుడు, రవిశంకర్‌లు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈయన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కిమిడి కళా వెంకటరావు, మాజీ ఎమ్మెల్యే కిమిడి గణపతిరావునాయుడుకు స్వయాన సోదరుడు. సోదరుడి మృతివార్తను తెలుసుకున్న సోదరులు, మాజీ మంత్రి కిమిడి మృణాళిని, విజయనగరం జిల్లా పార్లమెంటరీ టీడీపీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున, రేగిడి మాజీ ఎంపీపీ కిమిడి రామకృష్ణనాయుడు తదితరులు రేగిడి చేరుకుని, సత్యనారాయణ నాయుడు మృతదేహం వద్ద నివాళులర్పించారు. రేగిడి గ్రామంలో సత్యనారాయణనాయుడు అంత్యక్రియలు బుధవారం జరగనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

పోక్సో కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు

బొండపల్లి: పోక్సో కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా రూ.2 వేలు విధిస్తూ విజయనగరం పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి మంగళవారం సాయంత్రం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ వకుల్ జిందల్ ఒక ప్రకటనలో తెలిపారు. 2021వ సంవత్సరంలో బొండపల్లి పోలీస్ స్టేషన్‌లో బొండపల్లి గ్రామానికి చెందిన గొండేల చంద్రయ్య అలియాస్ శ్రీనివాస్‌పై పోక్సో కేసు నమోదైనట్లు పేర్కొన్నారు. బాలిక ఆడుకుంటుండగా చంద్రయ్య బలవంతంగా మామిడి తోటలోకి తీసుకెళ్లి లైంగికదాడికి ప్రయత్నించగా బాలిక కేకలు వేయడంతో గ్రామస్తులు రావడంతో నిందితుడు చంద్రయ్య పరారయ్యాడు. ఈ మేరకు బాలిక తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై వాసుదేవరావు, బొబ్బిలి డీఎస్పీ బి.మోహనరావు దర్యాప్తు నిర్వహించి అభియోగ పత్రాలు దాఖలు చేశారు. నేరారోపణ రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా శిక్ష ఖరారు చేసినట్లు ఎస్పీ వివరించారు.

ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ పనులపై విజిలెన్స్ తనిఖీలు


పనుల నాణ్యతను పరిశీలిస్తున్న విజిలెన్స్ ఎస్పీ ప్రసాదరావు

సీతంపేట: ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినిరింగ్ శాఖ ద్వారా నిర్మించిన పలు రహదారులపై మంగళవారం విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు తనిఖీ చేశారు. ఈ మేరకు కగడంగి పంచాయతీ పరిధిలోని నారాయణగూడ పరిధిలో గతంలో నిర్మించిన రహదారి పనుల నాణ్యతా ప్రమాణాలు చూశారు. నివేదికలు ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ డీఈ సత్యనారాయణ, ఈఈ రమాదేవి పాల్గొన్నారు.

గురువుల ఎన్నికల సందడి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు అభ్యర్థుల కసరత్తు
- ఇప్పటికే ఎన్నికల ప్రచారం ప్రారంభం
- తమ అభ్యర్థులకు మద్దతుగా నిలుస్తున్న ఉపాధ్యాయ సంఘాలు
- ఎన్నికల నోటిఫికేషన్ కోసం ఎదురు చూపులు
- బడిలో ఉన్న అయ్యవార్లను ప్రసన్నం చేసుకునే పనిలో ఆశావహులు
- ఈ ఏడాది మార్చి 27తో ముగియనున్న ప్రస్తుత ఎమ్మెల్సీ పదవీకాలం
- మార్చి నెలాఖరులో జరగనున్న ఎన్నికలు


సాలూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న యూటీఎఫ్ అభ్యర్థి విజయగౌరి (మధ్యలో ఉన్న మహిళ)

వీరఘట్టం/పాలకొండ:

గురువుల సమస్యలపై పోరాడేందుకు ఎన్నుకోవాల్సిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల హడావుడి మొదలైంది. ఈ ఏడాది మార్చి 27తో ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పదవీ కాలం ముగియనుంది. ఎమ్మెల్సీ పదవీకాలం ముగిసే 45 రోజుల లోపు కొత్త ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అంటే మరో నెలరోజుల్లో ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ వస్తుంది, నోటిఫికేషన్ వచ్చిన మరో నెల రోజుల్లో అంటే మార్చి నెలాఖరులోపు ఎన్నికలు జరగనుండడంతో ఆశావహుల్లో ఎన్నికల సందడి నెలకొంది.గతంలో పలు ఉపాధ్యాయ సంఘాలు కూటమిగా ఏర్పడి తాము ప్రతిపాదించిన అభ్యర్థులను గెలిపించుకున్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ మద్దతు తెలిపి మొదటి ప్రాధాన్యం ఓటును తమకు వేయాలని కోరుతూ ఇటీవల పాఠశాలల్లో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు.

ఇదీ పరిస్థితి..

ఉత్తరాంధ్ర పరిధిలో ఉన్న ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల పరిధిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక జరగనుంది. కొత్తగా ఏర్పడిన పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలు అన్ని ఎమ్మెల్సీ ఎన్నికల ప్రాప్తికి పాత జిల్లాల పరిధిలోకి వస్తాయి. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేట్‌తో పాటు అన్ని యాజమాన్యాల పరిధిలో సుమారు 25 వేల మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వారిని ప్రసన్నం చేసుకుని రానున్న ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యం ఓటును పొందేందుకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థులు గడిచిన వారం రోజులుగా అన్ని ప్రాంతాల్లో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు.

ఎమ్మెల్సీ కుర్చీ కోసం ముమ్మర ప్రచారం..

మరి కొద్ది రోజుల్లో జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసి ఎమ్మెల్సీ కుర్చీ పొందేందుకు ఆశావహులు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. వారిలో ముఖ్యంగా యూటీఎఫ్ బలపరిచిన అభ్యర్థిగా బొబ్బిలి ప్రాంతానికి చెందిన కోరెడ్ల విజయగౌరి తొలిసారి ఎమ్మెల్సీ బరిలో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. అలాగే విజయనగరానికి చెందిన పీఆర్‌టీయూ బలపరిచిన మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుని గెలుపొందేందుకు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. అంతేకాకుండా పైడి భీమవరానికి ప్రస్తుత ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ కూడా మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుని గెలుపొందేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. అలాగే శ్రీకాకుళానికి చెందిన బహుజన ఉపాధ్యాయ సంఘాలు ప్రతిపాదిస్తున్న పోతల దుర్గారావు తొలిసారి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచేందుకు ప్రచారాన్ని ప్రారంభించారు.ప్రధాన ఉపాధ్యాయ సంఘాలు బలపరుస్తున్న ఈ నలుగురు అభ్యర్థులతో పాటు మరో ముగ్గురు అభ్యర్థులు కూడా ఇటీవల కరపత్రాలను పంపిణీ చేశారు. దీంతో ఈ సారి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కుర్చీ కోసం పోటీ తీవ్రంగా ఉందని ఉపాధ్యాయులు అంటున్నారు.

ఈవీఎం గొడౌన్లను తనిఖీ చేసిన కలెక్టర్


ఈవీఎం గొడౌన్లను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పట్టణ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద గల ఈవీఎం గొడౌన్లను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీలో భాగంగా మంగళవారం ఆయన గొడౌన్లను సందర్శించి అక్కడి పరిస్థితిని గమనించారు. గొడౌన్లకు వేసిన సీళ్లను ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. గొడౌన్ల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశిస్తూ, ఏర్పాట్లపై పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, తహసీల్దార్ వై.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి అభినందనలు


లలితను అభినందిస్తున్న ఏజెన్సీ ప్రాంత క్రీడోపాధ్యాయులు


పారా అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న కొండగొర్రి లలిత

గుమ్మలక్ష్మీపురం/పాలకొండ రూరల్: పారా ఒలింపిక్స్ గేమ్స్‌లో పాల్గొనడమే లక్ష్యంగా బెంగళూరులోని సాయి అకాడమీలో పారా అథ్లెటిక్స్ శిక్షణ పొందుతున్న గిరిజన క్రీడాకారిణి కిల్లక లలితను పీడీలు పత్తిక చంద్రమోహన్, వి.పుష్పనాథం, ఎం.రామకృష్ణ, వీఎ.భాస్కర్, ఆర్.రాములు, బి.చంద్రరావు తదితరులు అభినందించారు. ఈమేరకు గుమ్మలక్ష్మీపురం మండలం గుల్లలంక గ్రామానికి చెందిన లలిత తనకు ఉన్న కంటికి సంబంధించిన దివ్యాంగత్వంతో కుంగిపోకుండా..తానేమీ తక్కువ కాదంటూ క్రీడల్లో రాణిస్తోంది. గత ఏడాది 2024లో చైనాలోని హ్యాంగ్జో నగరంలో జరిగిన దివ్యాంగుల ఆసియన్ పారా అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో పాల్గొని (అండర్ 19) 1500 మీటర్ల పరుగు పందెంలో ఉత్తమ ప్రతిభ కనపర్చి సిల్వర్ మెడల్, అలాగే బెంగళూరులో జరిగిన వరల్డ్ పారా అథ్లెటిక్స్‌లో 200 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని సిల్వర్ మెడల్‌ను సాధించింది. మొరాకో దేశంలోని మర్రాకేస్ నగరంలో జరిగిన పారా అథ్లెటిక్స్ పోటీల్లో కూడా పాల్గొని 400 మీటర్ల పరుగు పోటీల్లో 5వ స్థానం పొందింది. ఆయా పారా అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరుస్తూ ప్రస్తుతం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రోత్సాహంతో బెంగళూరులో శిక్షణ పొందుతున్న లలిత పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలోని ఏరియా ఆస్పత్రికి వ్యక్తిగత పనుల నిమిత్తం మంగళవారం రావడంతో ఆమెను కలిసిన ఏజెన్సీ ప్రాంత ఫిజికల్ డైరెక్టర్లు అభినందించారు. పారా ఒలింపిక్స్ క్రీడల్లో కూడా పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు.

అమృత్ భారత్ పనులు పరిశీలించిన డీఆర్‌ఎం


రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న వాల్తేర్ డీఆర్‌ఎం మనోజ్ కుమార్ సాహు, రాయగడ డీఆర్‌ఎం అమితాబ్ సింగల్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అమృత్ భారత్ నూతన స్టేషన్ నిర్మాణ పనులను వాల్తేర్ డీఆర్‌ఎం మనోజ్ కుమార్ సాహు, రాయగడ డీఆర్‌ఎం అమితాబ్ సింగల్‌లు మంగళవారం పరిశీలించారు. ప్రయాణికులకు కొద్ది రోజుల్లోనే అధునాతన రైల్వేస్టేషన్ అందుబాటులోకి తీసుకువస్తామని ఈ సందర్భంగా వారు చెప్పారు. అమృత్ భారత్ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నూతనంగా ఎఫ్ఓబీ, టికెట్ కౌంటర్, రిజర్వేషన్ కౌంటర్, వెయింటిగ్ హాల్ పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సీనియర్ డీసీఎం కె.సాందీప్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాక్స్ రిటర్న్స్ ఫైల్‌పై అవగాహన


మాట్లాడుతున్న ఇన్‌కమ్ ట్యాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్

విజయనగరం అర్బన్: ఆదాపయపు పన్ను శాఖకు సంబంధించిన రిటర్న్స్ ఫైల్‌కోసం గతంలో కార్యాలయాలకు రావాల్సి ఉండేదని, ప్రస్తుతం ఇబ్బంది కలిగించకుండా వ్యాపారుల వద్దకే వచ్చి అవగాహన కలిగించే సర్వీసులు అందిస్తున్నామని ఇన్‌కమ్ ట్యాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో వ్యాపారులకు 'డైరెక్ట్ ట్యాక్సెస్ విత్ వివాద్ సే విశ్వాస్ స్కీమ్ (డీటీవీఎస్‌వీ)-2024' అనే అంశంపై మంగళవారం అవగాహన కల్పించారు. డీటీవీఎస్‌వీ స్కీమ్ మంచిదని, దానిని అందరూ ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం ఐటీఓ వార్డ్-1 విశాఖ అనిరుథ్ ఆత్రేయ ఈ స్కీంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. చాంబర్ అధ్యక్షుడు కాపుగంటి ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌కమ్‌ట్యాక్స్ రేంజ్ 1, 2 అధికారులు ఎన్.గోపీకృష్ణ, పి.వి.శేషగిరిరావు, చాంబర్ సహకార్యదర్శి పచ్చిగుళ్ల రామారావు, చాంబర్ పూర్వ అధ్యక్షుడు ఎం.వి.చలం, పి.ఎస్.సి.నాగేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కనీస పింఛన్ రూ.9వేలు చెల్లించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు

విజయనగరం ఫూల్‌బాగ్: పెన్షనర్లకు కనీస ఫించన్ రూ.9వేలు చెల్లించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక కేఎల్‌పురంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆల్‌పెన్షన్స్ అండ్ రిటైర్డ్ పెన్షన్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ సమావేశం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గడిచిన 11 సంవత్సరాల కాలంగా ఎన్ని పోరాటాలు చేసిన ఈపీఎఫ్ 95 పెన్షనర్ల కనీస పెన్షన్ పెంచడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో 36లక్షల మంది కనీస పెన్షన్ వెయ్యిరూపాయలు పొందలేని పరిస్థితులు ఉన్నాయన్నారు. అదేవిధంగా హయ్యర్ పెన్షన్ కోసం 15 లక్షల మంది దరఖాస్తు చేస్తే నేటికీ దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే హయ్యర్ పెన్షన్ దరఖాస్తులు పరిశీలించి, వారందరికీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షనర్లరు ఫిబ్రవరి 1వ తేదీన ప్రకటించే బడ్జెట్‌లో కనీస పెన్షన్ రూ.9వేలు ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వచ్చే ఫిబ్రవరి 11,12,13, తేదీల్లో ఢిల్లీలో పోరాట కార్యక్రమం నిర్వహించనున్నామని, మార్చిలో రైల్‌రోకోలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కె సుధాకర్ పాల్గొని ప్రసంగించారు. కేపీ కుమార్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఎ.గౌరినాయుడు, కె.రామారావు, వి. శేషగిరి, జె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి జైలు శిక్ష

గుర్ల: మండల కేంద్రానికి చెందిన కోరాడ గౌరి, కోరాడ రమణ, కోరాడ అప్పయ్యమ్మలకు చీపురుపల్లి జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి వై.ప్రేమలత ఆరునెలలు జైలు శిక్ష , రూ. 500లు జరిమానా విధించారు. ఈ మేరకు ఎస్సై పి.నారాయణ రావు మంగళవారం తెలిపారు. 2018లో చీటీల నగదు ఎగవేత కేసుల్లో ఆరోపణలు రుజువు కావడంతో న్యాయమూర్తి ఈశిక్ష విధించినట్లు చెప్పారు.

మిమ్స్ విద్యార్థినికి రజత పతకం


వందనను అభినందిస్తున్న మిమ్స్ యాజమాన్యం

నెల్లిమర్ల: జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో మిమ్స్ కళాశాలలో ఫిజియోథెరపీ విద్యార్థిని సత్తాచాటింది. ఈనెల 19 నుంచి 22 వరకూ ఛత్తీస్‌గఢ్‌లో నిర్వహించిన జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో వందన పాల్గొని రజత పతకం సాధించింది. పవర్ లిఫ్టింగ్ పోటీలలో ద్వితీయ స్థానం సాధించిన ఆర్.వందనను ఆమె తల్లిదండ్రులు లక్ష్మీగాయత్రి, శంకరరావు, కోచ్ మహేష్‌లను మిమ్స్ చైర్మన్ అల్లూరు సత్యనారాయణ, మిమ్స్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ప్రవీణ్ వర్మ, డీన్ డాక్టర్ లక్ష్మీకుమార్ మంగళవారం అభినందించారు. వందన అంతర్జాతీయ పోటీలలో రాణించాలని ఆకాంక్షించారు. వందనను అభినందించిన వారిలో మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రఘురాం, అకడమిక్ డైరెక్టర్ వేణుగోపాల్ రావు, ఫిజియోథెరపీ ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్, వ్యాయామ అధ్యాపకులు కళావెంకట రావు, ఏఓ గణేష్ ఉన్నారు.

అంగన్వాడీల అంత్యక్రియలకు రూ.15 వేలు

సాలూరు: సర్వీసులో ఉంటూ మరణించిన అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు అంత్యక్రియల నిమిత్తం రూ.15 వేలు మంజూరుచేయనున్నట్లు స్త్రీశిసంక్షేమం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె సాలూరు పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ, జీఓఆర్‌టీ నంబర్ 9తో ఉత్తర్వులు జారీచేశామని వివరించారు. మరణించిన అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు చెందిన చట్టబద్ధమైన వారసులకు ఈ సొమ్ము అందించనున్నట్లు పేర్కొన్నారు.

తిరుచనాపల్లిలో జిల్లా గైడ్స్ ప్రదర్శన

విజయనగరం అర్బన్: తమిళనాడులోని తిరుచనాపల్లిలో మంగళవారం జరిగిన జాతీయ జంబోరీ స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థుల ప్రదర్శనకు ప్రశంసలు లభించాయి. వచ్చే నెల 3వ తేదీ వరకు తిరుచనాపల్లిలో జరుగుతున్న భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ జంబోరీ ప్రదర్శనలో జిల్లాకు చెందిన 49 మంది విద్యార్థులు పాల్గొంటారని జిల్లా కార్యదర్శి వాక చిన్నంనాయుడు తెలిపారు. రాష్ట్ర ప్రతినిధులుగా జిల్లా నుంచి 49 మంది సభ్యులతో జిల్లా కమిషనర్ బీపీరాజు, వైస్ ప్రెసిడెంట్ చోడవరపు నారాయణ మూర్తి, ఏఎస్‌ఓసీ దుర్గా నాగేశ్వరరావు, గైడ్ కెప్టెన్ నయా మున్నిసా, స్కౌట్ మాస్టార్లు పి.రమేష్ నాయుడు, ఎం.భాస్కరరావు, రాంకాశ్యప్, సోంపురం, లక్కిడాం, మెయిద, రెల్లివలస, కుమరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల స్కౌట్స్ 30 మంది, గైడ్స్ 19 మంది పాల్గొంటారని చెప్పారు.

ఐకాన్ అవార్డుకు ఎంపికైన గౌరీశ్వరి


చంద్రమతి పాత్రలో అక్కివరపు గౌరీశ్వరి

రాజాం: రాజాం పట్టణానికి చెందిన రంగస్థల కళాకారిణి అక్కివరపు గౌరీశ్వరి తెలుగు వెలుగు సాహితీ వేదిక ఐకాన్ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రాచీన శివభాగవతం, సారంగధర వంటి భూభాగవత కళారంగంతో పాటు పౌరాణిక నాటకాల్లో పలు పాత్రల్లో విశేష నటను కనబర్చిన గౌరీశ్వరి గత 15 ఏళ్లుగా నాటకరంగంలో జీవిస్తున్నారు. శివభాగవతంలో పార్వతీదేవి పాత్ర, సారంగధరలో చిత్రాంగిదేవి పాత్రలో ఆమె నటన రెండు తెలుగు రాష్ట్రాల్లో ఖ్యాతిగడించింది. పౌరాణిక నాటకాల్లో చంద్రమతి పాత్ర పోషిస్తూ కీర్తి గడించారు. పేరొందిన జాతీయ కళాకారుల సరసన పద్యనాటకాల్లో పాత్రలు పోషించి ఔరా అనిపించారు. కోవిడ్ కష్టకాలంలో పాత్రలు లేక ఇబ్బందులు పడ్డ చాలామంది కళాకారులకు ఆల్ ఇండియా కళారంగం ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా తన సేవలు, సాయం అందించి, అండగా నిలిచారు. ఆమె సేవలతో పాటు నటనను గుర్తించిన తెలుగుసాహితీ వేదిక స్వామి వివేకానంద జయంతి మహోత్సవాల సందర్భంగా ఐకాన్ అవార్డును ప్రకటించింది. ఫిబ్రవరి 2న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ అవార్డును నిర్వాహకులు ఆమెకు అందజేయనున్నారు. ఈ సందర్భంగా గౌరీని పలువురు కళాకారులు, రాజాం పట్టణ ప్రజలు అభినందించారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి రూ.50 వేల కోట్లు కేటాయించాలి

- తమ్మినేని సూర్యనారాయణ సీపీఎం జిల్లా కార్యదర్శి


వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: ఉత్తరాంధ్ర అభివృద్ధికి రూ. 50 వేల కోట్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. ఈ మేరకు స్థానిక ఎల్‌బీజీ భవనంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఫిబ్రవరి 1 నుంచి 3 రోజుల పాటు నెల్లూరులో ఆ పార్టీ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ... రాష్ట్రం విడిపోయిన తర్వాత ఉత్తరాంధ్ర జిల్లాలు పూర్తిగా వెనుకబడి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జిల్లాల అభివృద్ధికి రూ. 50 వేల కోట్లు కేటాయించాలని కోరారు. ఉత్తరాంధ్ర ప్రజలకు ఉపాధి నిచ్చే స్టీల్ ప్లాంట్‌కు ప్రభుత్వం సొంత గనులు కేటాయించకుండా కార్పొరేట్ వ్యక్తులకు కారు చౌకగా కట్టబెట్టాలని కుట్ర చేసిందని స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసి రక్షించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో గిరిజన యూనివర్సిటీ నిర్మాణం వేగవంతం చేయాలని, వేపాడ, మెంటాడ, ఎస్.కోట మండలాలతో కలుపుకుని ఐటీడీఏను ఏర్పాటు చేయాలని, గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు హామీలను అమలు చేయాలని వాటన్నింటి సాధన కోసం పోరాటాలు చేసే విధంగా సీపీఎం రాష్ట్ర మహాసభల్లో నిర్ణయించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి, రెడ్డి.శంకర్రావు పాల్గొన్నారు.

ఆలిండియా సివిల్ సర్వీసెస్ పోటీలకు ఇద్దరు ఎంపిక


కె.సూర్యనారాయణ


డి.యశోద

సంతకవిటి: మండలానికి చెందిన ఇద్దరు వ్యాయామ ఉపాధ్యాయులు ఆలిండియా సివిల్ సర్వీసెస్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన కె.సూర్యనారాయణ డిసెంబర్ 6 నుంచి 9 వరకు గుంటూరులో జరిగిన సివిల్ సర్వీసెస్ క్రీడల్లో లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానంలో నిలిచి, ఫిబ్రవరి 19 నుంచి 21 వరకు చండీగఢ్‌లో జరగనున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ క్రీడలకు రాష్ట్రం తరపున ఎంపికయ్యారు. ఆయన ప్రస్తుతం సంతకవిటి మండలంలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. అలాగే మండలంలోని తుమరాం గ్రామానికి చెందిన డి.యశోద గుంటూరులో జరిగిన సివిల్ సర్వీసెస్ క్రీడల్లో 200 మీటర్ల రన్నింగ్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి జాతీయస్థాయిలో జరగనున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ క్రీడల్లో 100, 200 మీటర్ల రన్నింగ్ విభాగంలో రాష్ట్రం తరపున ఎంపికయ్యారు. ఆమె ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా ఎల్.ఎన్.పేట మండలం కరకవలసలో వ్యాయామ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. వారి ఎంపిక పట్ల పలువురు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

గంజాయి వ్యాపారంతో సంపాదించిన ఆస్తులు సీజ్

- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి


గోపీనాథ్ జెట్టి, విశాఖ రేంజ్ డీఐజీ

విజయనగరం క్రైమ్: విజయనగరం జిల్లా ఎస్.కోట పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన గంజాయి కేసులో నిందితుడిగా అరెస్టు అయిన గంజాయి వ్యాపారి శెట్టి ఉమామహేశ్వరరావుకు చెందిన రూ.కోటి 97 లక్షల 62వేల 965 విలువైన స్థిర, చరాస్తులను అటాచ్ చేస్తున్నట్లు విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖలో నివాసం ఉంటున్న ఉమామహేశ్వరరావు అలియాస్ హుస్సేన్, అలియాస్ పుతిన్ అనే వ్యక్తికి చెందిన కారులో 222 కిలోల గంజాయిని ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లాలో డుంబ్రిగూడ నుంచి విశాఖకు తరలిస్తుండగా బొడ్డవర చెక్‌పోస్టు వద్ద పోలీసుల తనిఖీ సమయంలో పట్టుబడిందన్నారు. విచారణలో ప్రధాన నిందితుడిగా ఉమామహేశ్వరరావును గుర్తించి పీటీ వారెంట్ తీసుకుని అరెస్టు చేశామన్నారు. ఇటీవల ప్రభుత్వం గంజాయి వ్యాపారంతో కూడబెట్టిన అక్రమ ఆస్తులను అటాచ్ చేయాలని నిర్ణయించి, ఉత్తర్వులు జారీచేయడంతో ,చర్యలకు ఉపక్రమించామని తెలిపారు. ఒక్కో కేసులో నిందితుల ఆస్తులపై పోలీసులు విచారణ చేపట్టారని చెప్పారు. నిందితుడు ఉమామహేశ్వరరావుపై ఇప్పటికే అల్లూరి సీతారామరాజు జిల్లా, విజయనగరం, విశాఖ సిటీ పరిధిలో ఏడు గంజాయి కేసులు నమోదైనట్లు, లాభసాటి వ్యాపారంగా భావించి గంజాయి అక్రమరవాణాకు పాల్పడుతున్నట్లు గుర్తించామన్నారు. విచారణలో సంపాదించిన అక్రమ ఆస్తుల విలువ సుమారు రూ.2 కోట్లు ఉంటుందని వాటిని ఎవరికీ విక్రయించకుండా చట్ట పరిధిలో ఫ్రీజ్ చేసినట్లు నోటీసులు కూడా జారీచేశామన్నారు. ఈ ప్రక్రియలో క్రియాశీలకంగా పనిచేసిన విజయనగరం ఎస్పీ వకుల్ జిందల్, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్.కోట సీఐ వి.నారాయణమూర్తి, ఇతర అధికారులను డీఐజీ అభినందించారు.